ప్రజాశక్తి
శనివారం 17 మే 2025
5
శ్రీ సత్యసాయి



'లేపాక్షి నంది'తో పోస్ట్‌కార్డు విడుదల



స్టాంపును విడుదల చేస్తున్న తపాలా అధికారులు

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో శుక్రవారం నంది విగ్రహంతో కూడిన శాశ్వత తపాలా ముద్రను, వీరభద్రస్వామి దేవస్థానంపై ప్రత్యేక పోస్ట్ కార్డులను సిపిఎంజి ప్రకాష్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తపాలా ముద్రణతో లేపాక్షి నంది విశిష్టత ప్రపంచ నలుమూలలా విస్తరిస్తుందన్నారు. లేపాక్షి నంది చిత్రంతో పాటు ఆలయంలోని వేలాడే స్తంభం, వినాయకుడు, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం చిత్రాలతో పోస్ట్ కార్డులు ముద్రించారన్నారు. వీటి పోస్టు కార్డులు పోస్ట్ ఆఫీస్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కర్నూల్ రీజినల్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర, పోస్టల్ సూపరింటెండెంట్ విజయకుమార్, లేపాక్షి పుస్తక రచయిత చిదంబరరెడ్డి, పోస్టల్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి,ఉపాధి దిశగా అడుగులు

- రెన్యూ ఏర్పాటుతో అనంత అభివృద్ధి
- క్లీనర్, గ్రీనర్, గ్రేటర్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనే మా విజన్
- రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్



ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-గుత్తి

అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నట్లు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలియజేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం గుత్తి మండల పరిధిలోని బేతపల్లి గ్రామంలో రూ.22వేల కోట్లతో రెన్యూ పవర్ సంస్థ స్థాపించనున్న 4.8 గిగావాట్ల హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు పనులను శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రెన్యూ సంస్థ ఛైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్‌తో కలిపి నారా లోకేష్ శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అక్కడే జెసిబితో మట్టి తీసి పనులను ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. రూ.22వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్ గ్రిడ్‌లకు శక్తినివ్వడమే కాకుండా, నిరుద్యోగ యువత ఆశయాలకు వారధిగా ఉంటుందన్నారు. ఎపి క్లీన్ ఎనర్జీ పాలసీ హరితవిప్లవానికి బ్లూ ప్రింట్ లాంటిదన్నారు. గ్రీన్ పవర్ హౌస్‌గా మారుతున్న ఆంధ్రప్రదేశ్‌పై నమ్మకంతో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన రెన్యూ ఛైర్మన్, సిఇఒ సుమంత్ సిన్హా సంస్థ బందంకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయక సహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం రోడ్లు, మౌలిక సదుపాయాలను నిర్మించడానికే పరిమితం కాకుండా పరిశ్రమలను ఏర్పాటు చేస్తూ రేపటితరం భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తున్నారని చెప్పారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. క్లీనర్, గ్రీనర్, గ్రేటర్ ఆంధ్రప్రదేశ్ తమ విజన్ అన్నారు. కాలుష్య వారసత్వాన్ని వదిలేసి భవిష్యత్ తరాలకు క్లీన్ ఎనర్జీని అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

పారిపోయిన పరిశ్రమలన్నీ తిరిగి వస్తున్నాయ్

గత వైసిపి హయాంలో అప్పటి పాలకుల దెబ్బకు పారిపోయిన పరిశ్రమలు అన్నీ కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ రాష్ట్రానికి వస్తున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రెన్యూ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ కాంప్లెక్స్ ద్వారా స్థానిక యువత, రైతులకు మేలు జరుగుతుందన్నారు. జగన్ పాలనలో ఒక్క మెగావాట్ అదనపు విద్యుత్ రాష్ట్రంలో ఉత్పత్తి కాలేదన్నారు. చంద్రబాబుగారి నేతత్వంలో పునరుత్పాదక ఇంధన రంగానికి మళ్లీ గత వైభవం వచ్చిందని తెలియజేశారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణం పూర్తిచేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలని మంత్రి రవికుమార్ రెన్యూ సంస్థను కోరారు. రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనలో తాము భాగస్వాములం అవుతామన్నారు. ఎపిలో సింగిల్ విండో అనుమతులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రెన్యూ సోలార్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.శివప్రసాద్, రెన్యూ సర్వీసెస్ బిజినెస్ అండ్ విండ్ ప్రాజెక్ట్స్ సిఒఒ, గ్రూప్ ప్రెసిడెంట్ బలరామ్ మెహతా, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, గుత్తి తహశీల్దార్ ఓబులేసు, ఎంగన్నపల్లి సర్పంచి పి.భరత్ కుమార్, ఎంపీటీసీ ఎం.ధనంజయ, సంస్థ ప్రతినిధులు ప్రకాష్ బాబు,పృథ్వీ,ఆర్.రాజా తదితరులు పాల్గొన్నారు.



రెన్యూపవర్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు సంబంధించిన ఎంఒయు పత్రాలతో లోకేష్, రెన్యూ చైర్మన్



విద్యుత్ దీపాలంకణలో స్నాతకోత్సవం జరగనున్న ఆడిటోరియం



స్నాతకోత్సవం జరిగే ఆడిటోరియం భవనం

జెఎన్‌టియు స్నాతకోత్సవానికి వేళాయే..!

- నేడు ఎన్టీఆర్ ఆడిటోరియంలో వేడుక
- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- డాక్టర్ సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్
- ముఖ్యఅతిథిగా ఐఐటి కాన్పూర్ విశ్రాంత ఆచార్యులు ఎంఆర్.మాధవ్
- 41 మందికి బంగారు పతకాలు
- 40,109 మంది యూజీ, పీజీ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : విసి హెచ్.సుదర్శన్ రావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

14వ స్నాతకోత్సవ వేడుకలకు అనంతపురం జెఎన్‌టియు ముస్తాబైంది. శనివారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో పాల్గొంటారు. స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్టు జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్యభట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పూర్తి వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగానున్నారు.

40,109 మందికి డిగ్రీలు ప్రధానం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోనున్న అన్ని కళాశాలకు సంబంధించి బీటెక్, ఎంటెక్, ఎం ఫార్మసి, ఎంఎబిఎ పూర్తి చేసిన 40,109 మంది యుజి, పిజి విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. ఇందులో పరిశోధన డిగ్రీలు 167 కాగా, డాక్టర్ ఆఫ్ ఫార్మసి 361 మంది ఉన్నారు. ఎంటెక్, ఎంఫార్మసి, ఎంబిఎ పూర్తి చేసిన వారు 9,564 మంది ఉన్నారు. బీటెక్, బీఫార్మసి విద్యార్థులు 30,017 మంది ఉన్నారు.

41 మందికి బంగారు పతకాలు

ఉత్తమ ప్రతిభ కనబరచిన 41 మందికి బంగారు పతకాలను ప్రదానం చేయనున్నారు. ఇందులో మెకానికల్ విభాగంలో నంద్యాలకు చెందిన పూరిత్ కుమార్‌రెడ్డి ఏకంగా ఆరు బంగారు పతకాలు సాధంచారు. కంప్యూటర్ సైన్సులో ప్రతిభ కనబరచిన తయ్యూరు సుప్రజకు నాలుగు బంగారు పతకాలు వచ్చాయి. బంగారు పతకాలు సాధించిన వారందరికీ గవర్నర్ చేతులు మీదుగా అందజేస్తారు.

ముఖ్య అతిథులు : 14వ స్నాతకోత్సవానికి ఐఐటి కాన్పురు విశ్రాంత అధ్యాపకులు ఎంఆర్.మాధవ్ పాల్గొని సందేశాన్ని ఇవ్వనున్నారు. లారస్ ల్యాబ్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ చావకు 14వ స్నాతకోత్సవం సందర్భంగా జెఎన్‌టియు గౌరవ డాక్టరేట్‌ను అందించనున్నారు.

స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి : వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు



విలేకరులతో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి

జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. స్నాతకోత్సవ ఏర్పాట్లపై శనివారం నాడు వర్సిటీ పరిపాలన భవనంలోని ఆర్యభట్ట ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సమక్షంలో స్నాతకోత్సవ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, పిహెచ్‌డి డిగ్రీలు అందజేస్తామన్నారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు. స్నాతకోత్సవ ఆహ్వానితులు అందరూ సమయానికి విచ్చేసి క్రమశిక్షణతో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆహ్వానితులకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య ఎస్‌వి.సత్యనారాయణ, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్, పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిపుణులు, అధికారులతో కలిసి మార్కెట్ ను పరిశీలన చేస్తున్న వీరయ్య

మున్సిపల్ మార్కెట్‌ను ఉపయోగంలోకి తెస్తాం

నిపుణుల బృందంతో సందర్శించిన బాలాయ్య పీఏ వీరయ్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ నడిబొడ్డున మూడు ఎకరాల్లో రూ.30కోట్లతో నిర్మాణం చేసిన మార్కెట్‌ను వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎ వీరయ్య తెలిపారు. దీని పరిశీలన నిమిత్తం నిపుణుల బృందం శుక్రవారం నాడు హిందూపురం విచ్చేసింది. మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ సంఘం శ్రీనివాసులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ కన్సల్టెంట్ బందం ప్రతినిధి షబ్బీర్‌కు మార్కెట్, అక్కడ వ్యాపారుల గురించి వివరాలు తెలిపారు. అనంతరం కమిషనర్ చాంబర్‌లో వీరయ్య సమావేశం నిర్వహించారు. మార్కెట్టులోని 321 గదులను ఎలా ఉపయోగంలోకి తీసుకురావాలి... అందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి... ప్రస్తుతం ఎంత అద్దె ఉంది... ఎంత ఆదాయం వస్తోంది... తదితర విషయాలపై పూర్తి స్థాయిలో చర్చలు జరిపారు. బాలకృష్ణ సూచనల మేరకు మార్కెట్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, అయూబ్, నాయకులు దుర్గా నవీన్, వెంకటేశ్వర్ రెడ్డి, డిఈఈ ఆనంద రాజు, ఏఈ జనార్ధన్, శోభన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని డిఒఒ జి.కృష్ణప్ప తెలిపారు. పెనుకొండ మండలంలోని మావటూరు ఉపాధ్యాయులు రూపొందించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద డిఇఒ ఆవిష్కరించారు. డిఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు ఇస్తారని పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు వివరిస్తున్నారన్నారు. అప్పులు చేసి ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించవద్దని సూచించారు. ఉపాధ్యాయుల కృషిని డిఇఒ అభినందిచారు. కార్యక్రమంలో ఎడి లాజర్, మావటూరు పాఠశాల ఉపాధ్యాయులు రామలింగారెడ్డి, అమరా చంద్రబాబు, జయప్రసాద్, సిబ్బంది నరసింహుడు, రవి పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిఇఒ

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ - రైల్వే సహాయ మంత్రికి వినతి అందజేత



కేంద్ర మంత్రి సోమన్నతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో అవసరమైన చోట రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌లు రైల్వే సహాయ మంత్రి సోమన్నను కోరారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రైల్వే సహాయ మంత్రి శుక్రవారం నాడు జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన అనంతపురంలోని పరిటాల సునీత ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలో రైల్వే విభాగానికి సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యే సునీత వినతి పత్రం అందజేశారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171/600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం చుట్టుపక్కల ఇందిరమ్మ కాలనీ, కేతిరెడ్డి కాలనీ, టిడ్కో గృహాలు, రేగాటిపల్లి గ్రామాల ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. లెవల్ క్రాసింగ్ గేట్ ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని కోరారు. కదిరిదేవరపల్లి రైలులో పావగడ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కంబదూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా ధర్మవరానికి 260 కిలోమీటర్లు దూరం చుట్టి రావాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా కంబదూరు నుంచి పేరూరు, రామగిరి మీదుగా నాగసముద్రం గేట్ వరకు కొత్త రైల్వే లైన్ వేస్తే సుమారు 200 కిలోమీటర్లు పైగా దూరం తగ్గుతుందన్నారు. కంబదూరు-నాగసముద్రం మార్గంలో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని కోరారు. వీటిపై రైల్వే ఉన్నతాధికారులతో చర్చిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

పరిటాల ఇంటికి విమానయాన శాఖ మంత్రి

కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామమోహన్ నాయుడు గురువారం నాడు అనంతపురంలోని పరిటాల నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొంత సేపు రామమోహన్ నాయుడు పరిటాల శ్రీరామ్‌తో జిల్లా రాజకీయాలు, ఇతర విషయాలపై మాట్లాడారు.



సదస్సులో కరపత్రాలను విడుదల చేస్తున్న జలసాధన సమితి నాయకులు

ఎవరి కోసం గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్.?

నాలుగు దశాబ్దాలుగా హంద్రీనీవా అస్తవ్యస్తం - సదస్సులో జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అట్టహాసంగా నిర్మాణం చేస్తున్న గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టు ఎవరి ప్రయోజనాల కోసం తెరపైకి తెచ్చారో రాయలసీమ ప్రజలకు వివరించాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో 'సాగునీటి సమస్యలు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై జలసాధన సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర నాయకులు దనాపురం వెంకటరామిరెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టహాసంగా ప్రకటించి, నిర్మాణం చేస్తున్న గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టు అస్పష్టంగా ఉందన్నారు. పిపిపి పద్ధతిలో సాగునీటి ప్రాజెక్టు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా హంద్రీనీవా ప్రాజెక్టు అస్తవ్యస్తంగా ఉందన్నారు. రాయలసీమలోని అన్ని నీటి ప్రాజెక్టుల పరిస్థితీ ఇలానే ఉందన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడం రాయలసీమ ప్రాంత ప్రజలకు అన్యాయం చేయడమే అన్నారు. కృష్ణానదిపై సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మించాలని ఈ నెల 31వ తేదీన కష్ణానది సంగమేశ్వరం వద్ద జరుగు బహిరంగ సభలో రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సదస్సులో జలసాధన సమితి నాయకులు పరిగి నవీన్, జమీల్, ఆదినారాయణ, అమానుల్లా, జయరాం రెడ్డి, సోమందేపల్లి హనుమంత రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు రాజశేఖర్ రెడ్డి, లెక్చరర్ గంగిరెడ్డి, పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

హంద్రీనీవాపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రాయలసీమ జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి నిర్మాణం పనులు వేగవంతం చేసి, త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలగా ఉన్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండల పరిధిలోని మలకవేమల వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ పనులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇరిగేషన్ అడ్వయిజర్ వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టులో ఫేజ్ - 1, 2 కింద 554 కి.మీ. మేర కాలువ లైనింగ్, వెడల్పు పనులకు మొత్తం రూ.3,873 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే పేస్-1 కింద కర్నూలు జిల్లాలో 77,094, నంద్యాల జిల్లాలో 2,906, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాలు మొత్తం 1,98,000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఫేజ్-2 కింద అనంతపురం జిల్లాలో 33,617, సత్యసాయి జిల్లాలో 1,93,383, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాలు కలిపి మొత్తం 4,04,500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో 6,02,500 ఎకరాలకు సాగునీరు లభిస్తుందని చెప్పారు. 81 మండలాల్లో 33 లక్షల మందికి తాగు నీటి సరఫరాకు అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, ఇంజినీర్లు సీఈ నాగరాజు, స్వరూప్ కుమార్, మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సూరప్ప కట్టను పరిశీలన చేస్తున్న అధికారులు

సూరప్ప కట్టను ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం


ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సూరప్ప కట్టను ఆహ్లాద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ చొరవతో హిందూపురం పట్టణం సూరప్ప కట్ట చెరువు ప్రాంతంలో ప్రజలకు ఆహ్లాదకరమైన కనువిందు కలిగించడంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, జిల్లా అటవీ ఇతర శాఖల అధికారులు పర్యటించారు. పలు అంశాలపై అధికారులతో చర్చించి ప్రజలకు ఉల్లాసం, ఆహ్లాదం కలిగించేందుకు అవసరమైన ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి ఉందని అధికారులతో చర్చించారు. త్వరలోనే సూరప్ప కుంట ప్రాంతమంతా సుందరీకరణ చేస్తూ నీటితో నింపి బోటింగ్, పచ్చదనం, ఉద్యానవనం, వాకింగ్ ట్రాక్ ఇతరత్రా ప్రజలకు ఉపయోగపడే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తే ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రభుత్వం నుంచి నిధులు తెప్పిస్తారన్నారు.

వైభవంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు కుమార్తె వివాహం

ప్రజాశక్తి-అనంతపురం

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహం వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో ప్రముఖులతోపాటు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కేంద్ర రైల్వే సహాయక మంత్రి సోమన్న, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవితమ్మ, విప్ కాలవశ్రీనివాసులు, ఎంపిలు పార్థసారధి, అంబిక లక్ష్మినారాయణలతోపాటు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు సిడబ్లుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులు, అమిలినేని కుటుంబ సభ్యులతో మంత్రి నారా లోకేష్



వీరజవాను మురళీనాయక్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఉషశ్రీచరణ

వీర జవాను కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని కళ్లితండా గ్రామానికి చెందిన అగ్నివీర్ జవాను మురళీనాయక్ దేశ సరిహద్దులో శత్రు దేశం పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో వీర మరణం పొందిన విషయం తెలిసిందే. దీంతో మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్ గత మంగళవారం కళ్లితండాకు వచ్చి వీరజవాను మురళీనాయక్ తల్లిదండ్రు లను పరామర్శించారు. అలాగే వైసిపి తరపున రూ. 25 లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు శుక్రవారం వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కళ్లితండా వెళ్లి వీరజవాను తల్లిదండ్రులు శంకర్‌నాయక్, జ్యోతిబాయ్‌లకు రూ. 25 లక్షల చెక్కును అందజేశారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ పంపిన రూ. 25 లక్షల చెక్కును వీర జవాను కుటుంబానికి అందజేశామన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి జయరామ్ నాయక్, ఎంపిటిసి ఓబుల్‌రెడ్డి, సర్పంచి వాసునాయక్, ఉప సర్పంచి శ్రీనివాసులు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందనంత ఎత్తులో తాగునీటి కొళాయి

ప్రజాశక్తి-రొద్దం

వేసవి దృష్ట్యా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మినరల్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మండలంలోని బూచెర్ల గ్రామంలో రేకుల షెడ్డు వేసి అందులో మినరల్ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు. అయితే నీటి కొళాయిని చాలా ఎత్తులో ఏర్పాటు చేయడంతో నీటిని తీసుకెళ్లేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మెట్ల వద్ద కాకుండా మరోవైపు కొళాయి ఏర్పాటుచేయడంతో చిన్నపిల్లలు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. కావున నిర్వాహకులు స్పందించి కొళాయి వద్ద మెట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొళాయి ఎత్తులో ఉండడంతో ఇబ్బంది పడుతున్న బాలుడు

20న మినీ మహానాడు : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఈ నెల 20వ తేదీ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, పార్టీ అనుబంధ సంఘాలు కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే శనివారం సాయంత్రం పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం నుంచి విద్యా గిరి ఆర్చ్ వరకూ చేపట్టనున్న జాతీయ తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, బిజెపి జిల్లా అధ్యక్షుడు జి.ఎం.శేఖర్, జనసేన ఇన్‌ఛార్జ్ పత్తి చంద్రశేఖర్ పాల్గొంటారన్నారు. ర్యాలీలో కూటమి పార్టీల శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఇటీవల కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, కావున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిడిఒ సాయి మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం 'వేసవి తాపంపై పోరాటం' అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కావున ప్రతి గ్రామ పంచాయతీలో 'వేసవి తాపంపై పోరాటం' కార్యక్రమం చేపడతారని, ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాముదుర్తిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని పాముదుర్తి గ్రామంలో శుక్రవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో హోమియోపతి డాక్టర్లు గిరీష్, పద్మావతమ్మ ఆధ్వర్యంలో మోకాళ్ల నొప్పులు, వెన్ను నొప్పులు, థైరాయిడ్, తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కిడ్నీ క్యాన్సర్, పెరాలసిస్, తదితర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య చికిత్స చేశారు. శిబిరంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నేడు మంత్రి భూమిపూజ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో రూ. 3.30 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్లు, కాలువలు, రిజర్వ్ స్థలాలకు కంచె ఏర్పాటు తదితర పనులకు శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్ భూమిపూజ చేస్తారని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. అలాగే పట్టణ సుందరీకరణలో భాగంగా స్థానిక కొత్తపేట రైల్వే అండర్ పాస్ వద్ద అభివృద్ధి చేయబడిన ఆర్చ్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు.

కల్తీ కల్లు విక్రయదారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెనుకొండ

రొద్దం మండలంలోని చెరుకూరు గ్రామం వద్ద కల్తీ కల్లు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెనుకొండ ఎక్సైజ్ కార్యాలయంలో సిఐకు ఫిర్యాదు చేశారు. కెవిపిఎస్ నాయకులు రమణ మాట్లాడుతూ చెరుకూరులో కల్తీ కల్లు విక్రయిస్తున్నారని, దీంతో జీవీలప నంజుండప్ప ఆ కల్లుదుకాణంలో కల్లు తాగి అదే రోజు రాత్రి నిద్రలోనే మృతి చెందారని తెలిపారు. ఈ విషయంపై రొద్దం స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, నాయకులు అంజి, మారుతి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సరోజమ్మ కళాజాత బృందం సభ్యులు హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆ బృందం పట్టణంలోని కళా జ్యోతి సర్కిల్‌లో వీధి నాటకం ద్వారా హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చిన్న చూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి, క్షయ, సుఖ వ్యాధులు, చికిత్స కండోమ్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవీలత వైద్యాధికారి డాక్టర్ నజీర్, ఐసిటిసి కౌన్సెలర్ వనమాల, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్.భార్గవి, శక్తి మైత్రి మహిళా సంఘం పిఎం ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.నారాయణమ్మ, ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్ కుమార్, ఒఆర్‌డబ్ల్యు త్రివేణి, లక్ష్మీ కవిత, సరస్వతి పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని డిఆర్ఒ విజయసారథి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఒ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, సవరణ ఇతర క్లైంలకు సంబంధించిన అంశాలపై చేసిన దరఖాస్తుల స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొనే అవకాశం భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు, తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఓటర్ల రేషనలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని కోరారు. దీని కోసం ఆయా పార్టీల ఏజెంట్ల ద్వారా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి వివరాలను సేకరించి సన్నద్ధంగా ఉంటే తప్పులు లేని జాబితాకు సహకరించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జాకీర్‌హుస్సేన్, టిడిపి ప్రతినిధి ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి లక్ష్మీనారాయణ, జనసేన అబ్దుల్ ఖాదర్, శ్రీనివాసులు, బిజెపి భరత్‌కుమార్, సిపిఎం తరపున పైపల్లి గంగాధర్, బీఎస్పీ నుంచి సుబ్బరాయుడు, వైసిపి తరపున రవినాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ విజయసారథి

మంత్రి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-పెనుకొండ

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా శుక్రవారం మంత్రి సవిత ఆధ్వర్యంలో పట్టణంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ కూడలి, దర్గా సర్కిల్, శ్రీకృష్ణదేవరాయల కూడలి, గాంధీ సర్కిల్, తెలుగు తల్లి సర్కిల్ మీదుగా ర్యాలీ సాగింది. మంత్రితో పాటు పలువురు జాతీయ జెండాలు చేతబూని 'బోలో భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు. మంత్రి మాట్లాడుతూ దేశ సమైక్యత, సౌభ్రాతృత్వం ప్రతిబింబించేలా ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం వీర జవాను మురళీనాయక్‌కు అశ్రు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డి.ఎస్.పి నర్సింగప్ప, మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, సిఐ రాఘవన్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు మునిమడుగు వెంకటరాముడు, పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, సోమశేఖర్, లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, మహిళా నాయకులు చంద్రకాంతమ్మ, రమణమ్మ, బిజెపి నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, రవి, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండలో జాతీయజెండా చేతబూని తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి సవిత

సోమందేపల్లిలో త్వరలో కాపు భవన నిర్మాణం

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమందేపల్లి మండలానికి చెందిన బలిజ కులస్తులు మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు సోమందేపల్లిలో కాపు భవనానికి స్థలం కేటాయించి రూ. కోటి నిధులతో భవనం నిర్మిస్తామన్నారు. అతి త్వరలోనే నిధులు కేటాయించి భవనం పూర్తి చేస్తామని తెలిపారు. కాపుల ద్రోహి జగన్ అని, వైసిపి ప్రభుత్వం కాపులను పూర్తిగా విస్మరించిందని మంత్రి తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం : డీఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

'సమిష్టి కృషితో డ్రగ్స్‌ను పారదోలుదాం.. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అని డీఎస్పీ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయి ఆరామంలో శుక్రవారం ఈగల్ యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల డ్రైవింగ్ చేసే సమయంలో జరిగే ప్రమాదాలు, అనర్థాలపై వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయిని కట్టడి చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఈగల్ పేరుతో యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి విస్తరించడంలో కీలకపాత్ర పోషించే పెడ్లర్స్, ట్రాన్స్‌పోర్టర్స్, కంజూమర్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్, సైబర్ మోసాలు వంటి వాటిపై పోలీస్ అధికారులు ఆటో డ్రైవర్లకు వివరించారు. అనంతరం 'డ్రగ్స్ వద్దు బ్రో'పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐలు సునీత, సురేష్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, ఎస్ఐ కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్ విడుదల చేస్తున్న డీఎస్పీ, అధికారులు

కర్నాటకలో అభివృద్ధి శూన్యం : చిత్రదుర్గ ఎంపి

ప్రజాశక్తి-పావగడ

రాష్ట్రంలో సిద్ధరామయ్య ప్రభుత్వం హామీలు, పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిందని చిత్రదుర్గ ఎంపి గోవింద కారజోల విమర్శించారు. పట్టణంలోని నిరీక్షణ మందిరంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడి చేసి వందకు పైగా ఉగ్రమూకలను హతమార్చడంపై కొందరు కాంగ్రెస్ మంత్రులు మూర్ఖుల్లా మాట్లాడటం సరికాదన్నారు. కేంద్రంలో బిజెపి హయాంలో ప్రధాని మోడీ సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో సైన్యంపై నియంత్రణ చేపట్టారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడా ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులను హామీలతో మాయ చేసి సిద్ధరామయ్య అధికారంలోకి వచ్చారని, వారి సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత సిద్ధరామయ్య ప్రభుత్వంపై ఉందన్నారు. మడకశిర, పావగడ రైల్వేలైన్లకు కేంద్ర ప్రభుత్వం రూ. 265 కోట్లు విడుదల చేసి టెండర్లు సైతం పిలిచిందన్నారు. చిత్రదుర్గ నుంచి చెళ్లికెర, పావగడ మీదుగా ఏపిలోని పెనుకొండ వరకూ 178 కిలోమీటర్ల రహదారి అప్‌గ్రేడ్ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాలూకాలో ఎస్ఎస్ఎల్‌సి ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదని, దీనిపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిలో అనేక సమస్యలు నెలకొన్నాయని, ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో పేదలు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రవి, నాగేంద్ర, సాకేల్, మంజు, బంగారు మంజు, విజయలక్ష్మి, సుమన్, నాయుడు, హరీష్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి గోవింద కారజోల

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-పెనుకొండ

అత్యవసర విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా 3వ శనివారం అత్యవసర మరమ్మతులు చేపడుతామన్నారు. అందులో భాగంగా ఉదయం 09:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ పెనుకొండ టౌన్ 11 కెవి ఫీడర్ పరిధిలోని కుమ్మర దొడ్డి, చెరువుగేరి, తోటగేరి, ఎగువగడ్డ, ఎస్‌కెడి సర్కిల్, జిఐసి కాలనీ, వజ్రాలపేట, దర్గా సర్కిల్, దర్గా పేట, కమాన్‌వీధి, కొత్తపేట, గోనిపేట రోడ్, బోయగేరి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

కదిరిలో హాస్పిటల్ ప్రారంభం

కదిరి టౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న కృష్ణ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన నూతన ఆసుపత్రిని శుక్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో యాజమాన్యం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం అపహాస్యం'

ప్రజాశక్తి-మడకశిర

కూటమి ప్రభుత్వం అనైతిక చర్యలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం పట్టణంలో విలేక రుల సమావేశంలో స్థానిక సంస్థల్లో మెజార్టీ సభ్యులు లేకపోయినా కూటమి ప్రభుత్వం అనైతికంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలను కైవసం చేసుకోవాలని చూస్తుందన్నారు. కదిరి, హిందూపురం, మడకశిర మున్సిపాలిటీలతో పాటు కొన్ని మండల పరిషత్‌లలో వైసిపి సభ్యులను తమ వైపు తిప్పుకొని స్థానిక సంస్థల్లో పాగా వేయడానికి అప్రజాస్వామికంగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. కడపలో మేయర్‌పై, మాచర్ల లో కౌన్సిలర్లపై కుంటి సాకులు చూపి అనర్హత వేటు వేశారన్నారు. వీటిపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

దేశవ్యాప్త సమ్మె జులై 9కి వాయిదా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈ నెల 20వ తేదీ జరగాల్సిన దేశవ్యాప్త సమ్మెను జులై 9వ తేదీకి వాయిదా వేసినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సమ్మె చేయడం సరికాదని సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చారన్నారు. దీంతో 20న జరగాల్సిన సమ్మెను జులై 9వ తేదీకి వాయిదా వేశారన్నారు. రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఈ విషయం గమనించాలని కోరారు.

రైల్వే వంతెన పనులు వేగవంతం చేయాలి : జెసి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కదిరి రైల్వే గేట్‌పై నిర్మాణం అవుతున్న ఆర్ఓబి పనులను వేగవంతం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. జెసి శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయాన్ని సందర్శించి ఆర్‌డిఒ మహేష్‌ను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో దీర్ఘకాలిక ఫైల్స్‌కు ముగింపు పలికేలా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఆర్ఓబి పనులకు సహకరించిన ఇళ్ల బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెసి వెంట ఆర్‌డిఒ మహేష్, తహశీల్దార్ నటరాజు ఉన్నారు.



ఆర్ఓబి పనులపై అధికారులతో మాట్లాడుతున్న జెసి అభిషేక్ కుమార్

పరిశుభ్రత, పోషకాహారంతో ఆరోగ్యవంతమైన జీవితం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం చాలా అవసరమని వైద్యాధికారి డాక్టర్ జ్యోష్ణ సూచించారు. ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పిహెచ్‌సిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, ఇతర విష జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. కావున ఇంటి చుట్టుపక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలను శుభ్రం చేయడం, తొలగించడం, నీరు ఉన్న పాత్రలపై మూతలు పెట్టడం, ప్రతివారం డ్రై డే ఫ్రైడే పాటించాలన్నారు. దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వల్ల కూడా దోమలను నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మునిచంద్రిక, వైద్య సిబ్బంది నగేష్, రమణయ్య, సూపర్వైజర్ చంద్రకళ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్వియా సల్మాన్, డాక్టర్ చెన్నారెడ్డి, బిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ నాయక్, డాక్టర్ శ్రావణి, సబ్ యూనిట్ మలేరియా అధికారి జయరామ్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో బుక్కపట్నం పిహెచ్‌సి వైద్య సిబ్బంది డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటరమణయ్య, హెల్త్ సూపర్వైజర్ లింగా రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి శంకర్, వైద్య సిబ్బంది రాధ, అనిల్‌కుమార్, మురళి, హబిద్, తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సీసీ రోడ్డుపై వేసిన చెత్తదిబ్బ



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

సానిపల్లిలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని సానిపల్లి గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు, మురుగు నీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి. దీంతో భరించలేని దుర్వాసన, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నా మని గ్రామస్థులు వాపోతున్నారు. అంతేకాకుండా రేషన్ డీలర్ ఇంటి వెనుక ఉన్న వీధిలో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిల్వ ఉంటూ దోమలకు ఆవాసాలుగా మారుతుందని వాపోతున్నారు. తురకలాపట్నం వైపు నుంచి గ్రామంలోకి వచ్చేటప్పుడు సీసీ రోడ్డుపై ఎరువు దిబ్బలు, రోడ్డుకు ఇరువై పులా ముళ్ల పొదలు ఉన్నా అధికారులు కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ, నాయకులు కానీ పట్టించుకొన్న పాపాన పోలేదు. అలాగే రోడ్లపై పశువులు కట్టేయడంతో వాహనదారులు, పాదచా రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మొక్కజొన్న విత్తనాలు ఆరవేయండతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజల ఇబ్బందులకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. మండలంలోని బండ్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశాన్ని శుక్రవారం ఆయన సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలు మాట్లాడుతూ పని భారం ఎక్కువగా వుంటుందని, దినసరి వేతనం ఎంత వస్తుందో తెలియదని, స్లిప్పులు ఇవ్వడం లేదని, 6 వారాల నుంచి వేతనాలు ఇవ్వలేదని వాపోయారు. పనిముట్లు, వేసవి అలవెన్స్, రవాణా ఛార్జీలు ఇవ్వడం లేదని, ఫారం పాండ్ పనులు తప్ప వేరే పనులు లేవని, బలవంతంగా కూలీలతో పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారుర. శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేసి మేట్ల నియామకం చేపట్టలేదని ఫిర్యాదు చేశారు. వీటిపై పెద్దన్న మాట్లాడుతూ కూలీలు ఐక్యంగా, చైతన్యంతో ప్రశ్నించేతత్వం నేర్చుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. అన్ని సమస్యల పరిష్కారం కోసం సోమవారం బండ్లపల్లి గ్రామ సచివాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'ఉపాధి' హామీ ఎపిఒగా భార్గవి

ప్రజాశక్తి-మడకశిర



ఉపాధి హామీ చట్టం ఎపిఒగా భార్గవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎపిఒ లేపాక్షికి బదిలీ అయ్యారు. ధర్మవరంలో పని చేస్తున్న భార్గవిని మడకశిరకు బదిలీ చేశారు. నూతన ఎపిఒ భార్గవి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు తనవంతుగా పనులు కల్పిస్తామన్నారు. అందరితో చర్చించి సమన్వయం చేసి కూలీలందరికీ ఉపాధి కల్పిస్తామని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు.

నేడు తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని శనివారం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని నాయకులు తెలిపారు. బత్తలపల్లిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని జడ్పీ నిధులతో స్థానిక కదిరి రోడ్డులోని వెటర్నరీ హాస్పిటల్‌లో కొత్తగా బోరు బావులు తవ్వించారు. దానిని ప్రారంభించడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ వస్తున్నారని తెలిపారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని గౌకనపల్లి, వెలిచలమల, ధనియానిచెరువు గ్రామ సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో పార్థసారథి సందర్శించి హాజరు పట్టిక, పలు రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడి పనులను పరిశీలించారు. క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర విజయంపై హర్షం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఆపరేషన్ సింధూరలో భాగంగా త్రివిధ దళాలు పాకిస్తాన్ సైన్యాన్ని తరిమికొట్టి విజయం సాధించడం పట్ల శుక్రవారం కొత్తచెరువులో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ త్రివిధ దళాల సైన్యం ఎంతో ధైర్యంగా పోరాడి పాకిస్థాన్‌పై పైచేయి సాధించారని తెలిపారు. శత్రు దేశం కాల్పుల్లో అమరులైన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రబాబు, భాస్కర్, పాపన్న, హోటల్ నాయుడు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ మునీర్‌అహ్మద్ హెచ్చరించారు. స్థానిక కొడికొండ చెక్‌పోస్ట్‌లో శుక్రవారం కర్నాటకలోని బాగేపల్లి వైపు నుంచి వచ్చే వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడపడం ద్వారా అత్యధికంగా ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విజయ్, లింగమూర్తి ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ యువకుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌టి సామాజిక వర్గానికి చెందిన 14 ఏళ్ల బాలిక తాడిమర్రి మండలంలోని ఓ గ్రామంలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన సురేంద్ర అనే యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తల్లి తెలిపింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సురేంద్రపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బాలప్పగారిపల్లి తండాలో సోదాలు చేసి నాటుసారా తయారు చేస్తున్న నిర్మలబాయ్‌ను అరెస్ట్ చేశారు. ఆమె నుంచి 14 లీటర్ల నాటుసారా, 20 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను కదిరి పిడిఎం కోర్టులో హాజరు పరిచారు. అనంతరం అనంతపురం జిల్లా జైలుకు తరలించారు. దాడుల్లో ఎస్ఐ శ్రీధర్, హెడ్ కానిస్టేబుల్ భీమ్లానాయక్, ప్రకాష్, రమణ నాయక్, కానిస్టేబుల్ బాషా, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.